నమస్తే తెలంగాణ

యాదాద్రి భువనగిరి

I | హైదరాబాద్, శుక్రవారం 5 జూలై 2024 | YADADRI BHUVANAGIRI


## డిగ్రీలో స్పాట్ అడ్మిషన్లు

భువనగిరి కలెక్టరేట్, జూలై 4 : జిల్లాలోని అనంతారం గ్రామంలో గల మహాత్మా జ్యోతిబా పూలే తెలంగాణ వెనుకబడిన తరగతుల పురుషుల డిగ్రీ కళాశాలలో బీఏ(ఈపీహెచ్), బీకామ్(సీఏ), బీఎస్సీ(ఎంపీసీఎస్), బీఎస్సీ(ఎంఎస్సీఎస్), బీఎస్సీ(బీజడ్సీ), బీఎస్సీ(బీజెడ్జీ), బీకామ్(బీఏ) ఇంగ్లిష్ మీడియం కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తులు (స్పాట్ అడ్మిషన్స్) ఆహ్వానిస్తున్నట్లు ఎం.షకీనా, కళాశాల ప్రిన్సిపాల్ పి.వెంకటేశ్వర్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులైన విద్యార్థులు సంబంధిత ఒరిజినల్ ధ్రువపత్రాలతో ఈ నెల 7వరకు కళాశాలలో దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. నాణ్యమైన విద్యతోపాటు ఉచిత భోజన వసతి, పాఠ్య పుస్తకాలు, సౌకర్యాలు అందుబాటులో ఉంటాయని, పూర్తి వివరాలకు 9133982902, 9505110024, 9440420159 నంబర్లను సంప్రదించాలని తెలిపారు.

# నేటి నుంచి ఉద్యోగుల బదిలీలు

## జాబితాల తయారీలో అధికారుల బిజీ

8వ తేదీలోపు ఖాళీలు, బదిలీల జాబితా

నాలుగేండ్లు ఒకే చోట పనిచేస్తే స్థానచలనం

40శాతం ఉద్యోగులు మించకుండా ట్రాన్స్‌ఫర్లు

జిల్లాలో సుమారు 2,500 ఉద్యోగులు..




యాదాద్రి భువనగిరి, జూలై 4 (నమస్తే తెలంగాణ) : ప్రభుత్వ ఉద్యోగుల బదిలీలపై ఉన్న నిషేధాన్ని ఎత్తేయడంతో ఇక ట్రాన్స్‌ఫర్ల పర్వం షురూ కానుంది. ఇటీవల ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయుల పదోన్నతులు, బదిలీలు ముగియగా, ఇప్పుడు సాధారణ బదిలీలకు శ్రీకారం చుట్టారు. దాంతో దీనిపై జిల్లా అధికారులు ఫోకస్ పెట్టారు. జిల్లాలో ఉద్యోగులకు సంబంధించి అధికారులు సీనియారిటీ జాబితాను రూపొందిస్తున్నారు. శుక్రవారం నుంచి బదిలీల ప్రక్రియ ప్రారంభం కానుంది.

### ఐదేండ్ల తర్వాత

సుమారు ఐదేండ్ల తర్వాత బదిలీలు జరుగనున్నాయి. ఈ మేరకు బదిలీలపై సర్కారు నిషేధం ఎత్తేసింది. దీంతో జిల్లాలో అనేక మందికి స్థానచలనం లభించనుంది. జిల్లాలో సుమారు 2,500 మంది ఉద్యోగులు ఉన్నారు. దీనికి ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు అదనం. అయితే నాలుగేండ్లు ఒకే చోట పనిచేస్తున్న వారికి ట్రాన్స్‌ఫర్ తప్పనిసరి కానుంది. కమర్షియల్ ట్యాక్స్, రవాణా, ఎక్సైజ్, విద్య, అటవీ పోలీస్ శాఖలకు మినహాయింపు ఇచ్చారు. 2024 జూన్ 30 నాటికి ఒకే చోట రెండేండ్లు సర్వీస్ పూర్తికాని వారికి బదిలీ చేయరు. రెండేండ్లు పూర్తయ్యిన వారే అర్హులుగా నిర్ణయించారు. ఏడాదిలోపు ఉద్యోగ విరమణ ఉన్నవారికి బదిలీలు ఉండవు. ఒకే వేళ కావాలనుకుంటే వారు దరఖాస్తు చేసుకోవచ్చు. మొత్తం పోస్టుల్లో 40శాతం మించి ఉద్యోగులను బదిలీ చేయవద్దు. అంటే అర్హుల్లో 40శాతం మాత్రమే బదిలీ అవుతారు.

### నేటి నుంచి జాబితాల తయారీ..

ఉద్యోగుల బదిలీల షెడ్యూల్ శుక్రవారం విడుదల కానుంది. దీంతో బదిలీల ప్రక్రియ ప్రారంభమవుతుంది. వెబ్ కౌన్సెలింగ్ ద్వారా ఉద్యోగుల ఆప్షన్లను స్వీకరిస్తారు. నాలుగేండ్లకు మించి ఒకే చోట పనిచేస్తున్నవారి పేర్లతో జాబితాను శుక్రవారం నుంచి 8వ తేదీ వరకు విడుదల చేస్తారు. ఖాళీలు, కచ్చితంగా బదిలీ చేయాల్సిన వివరాలు వెల్లడవుతాయి. 9 నుంచి 12 వరకు ఉద్యోగుల నుంచి ఆప్షన్లు స్వీకరిస్తారు. 13 నుంచి 18 వరకు దరఖాస్తులను పరిశీలించి, 19, 20 తేదీల్లో బదిలీల ఉత్తర్వులను జారీ చేస్తారు. 21 నుంచి ఉద్యోగుల సాధారణ బదిలీలపై మళ్లీ నిషేధం అమల్లోకి వస్తుంది.

### ఎన్నికల ముందటి బదిలీల సంగతేంటి..?

సాధారణ బదిలీలు షురూ కానుండగా, ఎన్నికల ముందు చేసిన బదిలీలపై చర్చ నడుస్తున్నది. గతేడాది అసెంబ్లీ ఎన్నికల ముందు సెప్టెంబర్, అక్టోబర్ నెలల్లో ఎన్నికల బదిలీలు చేపట్టారు. మూడేండ్ల దాటిన అధికారులు, ఉద్యోగులు సొంత జిల్లాకు చెందిన వారిని వివిధ ప్రాంతాలకు బదిలీ చేశారు. సాధారణంగా ఎన్నికలు ముగిశాక వారంతా సొంత ప్రాంతాలకు తిరిగి బదిలీపై వెళ్తారు. కానీ ఇప్పటి వరకు ఎన్నికల బదిలీలపై స్పష్టత రాలేదు. ఇదిలా ఉంటే ఉండగా, ఎన్నికల ముందు జిల్లాకు బదిలీపై వచ్చిన అధికారులు, ఉద్యోగులు తిరిగి వెళ్లేందుకు ఆసక్తి చూపించడంలేదు. యాదాద్రి భువనగిరి జిల్లా.. హైదరాబాద్ నగరానికి సమీపంలో ఉండటంతో ఇక్కడే పనిచేసేందుకు మక్కువ చూపిస్తున్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, చిత్రంలో ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య, ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి తదితరులు

## అవసరం లేని దేవస్థానం భూములను తిరిగి రైతులకు అప్పగిస్తాం

- రెండేండ్లలో బస్వాపూర్, గంధమల్ల జలాశయాలను పూర్తి చేస్తాం
- మంత్రి కోమటిరెడ్డి

యాదగిరిగుట్ట, జూలై4 : యాదగిరిగుట్ట దేవస్థానం పునర్నిర్మాణంలో భాగంగా రైతులను నుంచి సేకరించిన భూములను తిరిగి వారికి అప్పగిస్తామని రాష్ట్ర రోడ్లు భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. దేవస్థానం అభివృద్ధిపై త్వరలో సీఎం రేవంత్‌రెడ్డితో సమీక్ష నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. యాదగిరిగుట్ట మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో స్థానిక సంస్థల ప్రజాప్రతినిధుల ఆత్మీయ వీడ్కోలు సమావేశానికి ఆయన గురువారం ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య, ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డితో కలిసి పాల్గొన్నారు. కార్యాలయ అవరణలో మహాత్మాగాంధీ విగ్రహం, తెలంగాణ తొలి అమరుడు దొడ్డి కొమురయ్య, స్వామి వివేకానంద వర్ధంతితోపాటు విప్లవ వీరుడు అల్లూరి సీతారామ రాజు జయంతి సందర్భంగా వారి చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పించారు.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ మిషన్ భగీరథ పథకానికి రూ. 210 కోట్లు మంజూరయ్యాయని, భువనగిరి, ఆలేరు నియోజకవర్గాలకు స్వచ్ఛమైన తాగునీటిని అందజేస్తామని అన్నారు. లక్ష్మీనరసింహస్వామి సాక్షిగా ఆగస్టు 15లోగా రైతులందరికీ రూ. 2 లక్షల రుణమాఫీని అమలు చేస్తామని తెలిపారు. మరో రెండేండ్లలో బస్వాపూర్, గంధమల్ల జలాశయాలను పూర్తి చేసి సాగు జలాలు అందించనున్నట్లు చెప్పారు. ఈ సమావేశంలో జడ్పీటీసీ, వైస్ ఎంపీపీ, ఎంపీటీసీ, మాజీ సర్పంచులు, అధికారులు పాల్గొని ఐదేండ్లుగా చేసిన పనులను గుర్తు చేసుకున్నారు. అనంతరం ఎంపీడీఓ నవీన్‌కుమార్ పదవీ విరమణ పొందిన ఎంపీపీ, జడ్పీటీసీ, ఎంపీటీసీలకు జ్ఞాపికలను అందజేసి సన్మానించారు. ఈ కార్యక్రమంలో జడ్పీ సీఈఓ శోభారాణి, మున్సిపల్ చైర్ పర్సన్ ఎరుకల సుధాహేమేందర్‌గౌడ్, మాజీ ఎంపీపీ చీర శ్రీశైలం, జడ్పీటీసీ తోటకూరి అనురాధ, మాజీ వైస్ ఎంపీపీ ననబోలు ప్రసన్న, మాజీ ఎంపీటీసీలు కాల్నె అయిలయ్య, రేపాక మౌనిక, ఎంపీఓ చంద్రశేఖర్, మాజీ సర్పంచులు తోటకూరి బీరయ్య, కసావు శ్రీనివాస్‌గౌడ్, బీమగాని రాములు పాల్గొన్నారు. జడ్పీటీసీ, ఎంపీపీల పదవీకాలం ముగియడంతో మండలానికి ప్రభుత్వం ప్రత్యేకాధికారులను నియమించింది. ఇందులో భాగంగా యాదగిరిగుట్ట మండల ప్రత్యేకాధికారిగా జిల్లా మార్కెటింగ్ అధికారి ఎ. సబిత నియమితులయ్యారు.

## మోత్కూరు ఎస్సీ గురుకుల ప్రిన్సిపాల్, కేర్‌టేకర్‌కు షోకాజ్ నోటీసులు

నమస్తే తెలంగాణ ఎఫెక్ట్

మోత్కూరు, జూలై 4 : పట్టణంలోని ఎస్సీ గురుకుల బాలుర విద్యాలయం ప్రిన్సిపాల్ వెంకటస్వామి, కేర్‌టేకర్ సుప్రియకు ఆర్‌సీఓ రజనీ షోకాజ్ నోటీసులు జారీ చేశారు. మెనూ పాటించని గురుకులం పేరిట 'నమస్తే తెలంగాణ' దినపత్రికలో వచ్చిన కథనానికి స్పందించిన కలెక్టర్ విచారణకు ఆదేశించిన విషయం విదితమే. ఆర్‌సీఓ రజనీ పాఠశాలలో విచారణ చేసి నివేదికను గురువారం కలెక్టర్ హనుమంతు కె.జెండగేకు అందజేశారు. పాఠశాల ప్రిన్సిపాల్ వెంకటస్వామి మెనూపై పర్యవేక్షణ చేయకపోవడం, కేర్ టేకర్ సుప్రియ అలసత్వం వల్లే విద్యార్థులకు ఉడకని అన్నం, పలుచని చారు, మజ్జిగ, రుచి లేని కూరలను వడ్డించినట్లు వివరణ ఇచ్చారు. భవిష్యత్‌లో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా జాగ్రత్త పడాలని వారిని తీవ్రంగా హెచ్చరించినట్లు పేర్కొన్నారు. విద్యార్థులకు భోజనం తినడం కోసం డైనింగ్ టేబుల్, పాఠశాలకు రెగ్యులర్ ప్రిన్సిపాల్‌ను నియమించాలని గురుకులాల సెక్రటరీ, ఉన్నతాధికారులను కోరినట్లు ఆర్‌సీఓ పేర్కొన్నారు.

## నూతన ఆవిష్కరణలపై ఎయిమ్స్, ఐఐటీ ఎంఓయూ

బీబీనగర్, జూలై 4 : మండలంలోని బీబీనగర్ ఎయిమ్స్‌లో హైదరాబాద్ ఐఐటీ బృందం సభ్యులు గురువారం పర్యటించారు. ఈ సందర్భంగా కొత్త ఆవిష్కరణలు, ఉమ్మడి పరిశోధనపై ఎయిమ్స్ డైరెక్టర్ వికాస్ భాటియా, ఐఐటీ డైరెక్టర్ ప్రొఫెసర్ బీఎస్ మూర్తి రెండు సంస్థల మధ్య అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు, అధ్యాపకులకు ప్రయోజనం చేకూర్చే పరిశోధనలు చేపట్టడానికి ఈ ఒప్పందం ఉపయోగపడుతుందన్నారు. ఎంఓయూ నిబంధనలు, షరతుల ప్రకారం రెండు సంస్థలు కొత్త ఆవిష్కరణలు, పీహెచ్‌డీ, మాస్టర్స్, డిగ్రీ, డిప్లొమా సర్టిఫికెట్ వంటి ఉమ్మడి కోర్సుల ప్రారంభం, పేటెంట్ల అభివృద్ధి, ఫ్యాకల్టీ, రెండు సంస్థల మధ్య ఉమ్మడి పరిశోధనపై సహకరిస్తాయని తెలిపారు.

## ప్రేరణ శిక్షణకు జిల్లా విద్యార్థులు

భువనగిరి అర్బన్, జూలై 4 : గుజరాత్‌లోని బాద్‌నగర్ వెర్నాక్యులర్ స్కూల్‌లో నిర్వహించే జాతీయ స్థాయి ప్రేరణ శిక్షణకు జిల్లా నుంచి ఇద్దరు విద్యార్థులు ఎంపికైనట్లు డీఈఓ కె.నారాయణరెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పాఠశాల విద్య, అక్షరాస్యత విభాగం, విద్యా మంత్రిత్వ శాఖ, భారత ప్రభుత్వం సంయుక్తంగా ప్రేరణ (ఒక అనుభవపూర్వక అభ్యాస కార్యక్రమం) ప్రారంభించిందని పేర్కొన్నారు. ఇందులో పాల్గొనే వారందరికీ అర్థవంతమైన, ప్రత్యేకమైన, స్ఫూర్తిదాయకమైన అనుభవాన్ని అందించడం, తద్వారా వారిని నాయకత్వ లక్షణాలతో శక్తివంతం చేయడం దీని ఉద్దేశమని తెలిపారు. ప్రేరణ అనేది 9నుంచి 12వ తరగతి వరకు ఎంపిక చేయబడిన విద్యార్థుల కోసం ఒక వారం రోజుల రెసిడెన్షియల్ శిక్షణ కార్యక్రమం అని వివరించారు. ఈ శిక్షణకు చౌటుప్పల్ కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం 10వ తరగతి విద్యార్థిని రఫియా, భువనగిరి కేంద్రీయ విద్యాలయానికి చెందిన పదో తరగతి విద్యార్థి సాత్విక్ ఎంపికయ్యారని తెలిపారు. వీరితోపాటు చౌటుప్పల్ కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయానికి చెందిన జీవశాస్త్ర ఉపాధ్యాయురాలు కె.కవిత హాజరవుతారని పేర్కొన్నారు. ఈ నెల 7నుంచి 13వరకు ఈ శిక్షణ ఉంటుందని తెలిపారు. శిక్షణకు ఎంపికైన విద్యార్థులను ఆయన అభినందించారు.

## ఎప్‌సెట్ కౌన్సిలింగ్ ప్రారంభం

- 4 నుంచి 12 వరకు స్లాట్ బుకింగ్
- నల్లగొండ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో పరిశీలన సెంటర్ ఏర్పాటు

రామగిరి, జూలై 4 : ఇంజినీరింగ్, ఫార్మసీ కోర్సుల్లో ప్రవేశానికి నిర్వహించిన తెలంగాణ ఇంజినీరింగ్ అగ్రికల్చర్ అండ్ ఫార్మసీ కామన్ ఎంట్రెన్స్ టెస్ట్ (ఈఏపీసెట్)–2024 ఎంపీసీ స్ట్రీమ్ అభ్యర్థుల కౌన్సిలింగ్ ప్రక్రియ ప్రారంభమైంది. ఈ నెల 6 నుంచి సర్టిఫికెట్ల పరిశీలన జరుగనుండగా అందుకు సంబంధించి ఆన్‌లైన్ స్లాట్ బుకింగ్ ప్రక్రియ మొదలైంది. నల్లగొండలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఆన్‌లైన్ కౌన్సిలింగ్ సెంటర్‌ను ఏర్పాటు చేశారు. స్లాట్ బుకింగ్ చేసుకున్న తర్వాతే కౌన్సెలింగ్‌కు హాజరు కావాలని, స్లాట్ బుకింగ్ లేకుండా వస్తే సర్టిఫికెట్ల పరిశీలన చేయడం జరుగదని నల్లగొండ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ పి. జానకి దేవి తెలిపారు.

### కౌన్సిలింగ్ షెడ్యూల్ ఇలా..

- కౌన్సిలింగ్ కోసం స్లాట్ బుకింగ్ చేసుకునే ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు రూ.600, ఇతర విద్యార్థులు రూ.1200 ఫీజు చెల్లించాలి.
- ఈ నెల 6 నుంచి 13 వరకు సర్టిఫికెట్ల పరిశీలన చేసుకునే అవకాశం ఉంది.
- ఈ నెల 8 నుంచి 15 వరకు కళాశాలలో ఎంపికకు వెబ్ ఆప్షన్.
- ఈ నెల 19న సీట్ అలాట్‌మెంట్
- తొలి విడుత సీటు వచ్చిన విద్యార్థులు ఈ నెల 19 నుంచి 23లోపు ఆయా కళాశాలలో ఫీజు చెల్లించి చేరాలి.
- రెండో విడుత కౌన్సిలింగ్ ఈ నెల 26 నుంచి ఆగస్టు 4 వరకు ఉంటుంది.

## జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు దరఖాస్తులు

భువనగిరి అర్బన్, జూలై 4 : జిల్లాలోని మండల విద్యాశాఖాధికారులు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు జాతీయ స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు ఆన్‌లైన్‌లో ఈ నెల 15లోపు దరఖాస్తు చేసుకోవాలని డీఈఓ కె. నారాయణరెడ్డి గురువారం ప్రకటనలో తెలిపారు. http://nationalawardstoteachers. education.gov.in లో దరఖాస్తు చేయాలని, అందరు ఉపాధ్యాయులకు ఈ సమాచారం అందించడంతోపాటు కార్యాలయాల నోటీసు బోర్డులో ప్రదర్శించాలని ఎంఈఓలు, ప్రధానోపాధ్యాయులకు సూచించారు.

## ఎంజీయూ జాబ్ మేళాకు విశేష స్పందన

- ఉమ్మడి జిల్లా నుంచి 400 మంది విద్యార్థుల హాజరు

రామగిరి, జూలై 4 : మహాత్మా గాంధీ యూనివర్సిటీలో యూనివర్సిటీ ప్లేస్‌మెంట్ సెల్ ఆధ్వర్యంలో ఇమ్మార్టికల్స్ లెర్నింగ్ హైదరాబాద్ సహకారంతో గురువారం నిర్వహించిన జాబ్ మేళాకు విశేష స్పందన లభించింది. ఉమ్మడి జిల్లాతో పాటు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి 400 మందికిపైగా విద్యార్థులు హాజరయ్యారు. జాబ్ మేళాను ఎంజీయూ ప్లేస్‌మెంట్ సెల్ అధికారిని వై.ప్రశాంతి, యూనివర్సిటీ ఇన్‌చార్జి రిజిస్ట్రార్ అల్వాల రవితో కలిసి ప్రారంభించారు. ఐటీ, నాన్ ఐటీ రంగాల్లో అవకాశాలకు బీటెక్, ఎంసీఏ, బీఎస్సీ కంప్యూటర్స్ ఇతర డిగ్రీ అర్హతతో విద్యార్థులు హాజరైనట్లు వెల్లడించారు. జాబ్ మేళాలో ఎంపికైన విద్యార్థులకు ఆయా కంపెనీల నుంచి నియామక ఉత్తర్వులు త్వరలోనే అందుతాయని వై.ప్రశాంతి చెప్పారు.

## పంచాయతీ కార్మికుల వేతనాలు చెల్లించలేని దుస్థితిలో ప్రభుత్వం

- మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య

చిట్యాల, జూలై 4 : పంచాయతీ కార్మికుల వేతనాలు చెల్లించలేని దీన స్థితిలో ప్రభుత్వం ఉందని మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య అన్నారు. చిట్యాలలో గురువారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఓ వైపు వర్షాలు ప్రారంభమై సీజనల్ వ్యాధులు వ్యాపిస్తుంటే మరో వైపు ప్రభుత్వం వేతనాలు చెల్లించకపోవటంతో పారిశుధ్య పరిస్థితి దారుణంగా మారిందని తెలిపారు. పంచాయతీల్లో మౌలిక వసతులు కరువయ్యాయని, బ్లీచింగ్ పౌడర్ కూడా సరఫరా చేయని పరిస్థితి నెలకొన్నదని దుయ్యబట్టారు. వేతనాలు అందక పని ఒత్తిడితో పంచాయతీ కార్మికులు ఎంపీడీఓల వద్ద లాంగ్ లీవ్ కోసం దరఖాస్తులు పెట్టుకుంటున్నారని, ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ ఏర్పడ్డాక తొలి ముఖ్యమంత్రిగా కేసీఆర్ గ్రామాల అభివృద్ధి కోసం ఎన్నో పథకాలు అమలు చేశారని, కాంగ్రెస్ పాలనలో వాటి ఆలనాపాలన లేకుండా పోయిందని తెలిపారు. హరితహారం మొక్కలకు నీరు పోసే పరిస్థితి కూడ లేకుండా పోయిందని అన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేసే పరిస్థితిలో కాంగ్రెస్ ప్రభుత్వం లేదని, 7 నెలలు గడిచినా ప్రజా సమస్యలపై అవగాహనకు రాలేదని విమర్శించారు. పంచాయతీ సిబ్బందికి వెంటనే వేతనాలు చెల్లించకపోతే ఆందోళనలు చేస్తామని, కలెక్టరేట్ ముట్టడిస్తామని చిరుమర్తి హెచ్చరించారు.

ఈ సమావేశంలో బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు పొన్నం లక్ష్మయ్య, నాయకులు గోధుమగడ్డ జలంధర్‌రెడ్డి, కోనేటి యల్లయ్య, కందాటి రమేశ్ రెడ్డి, ఆగు అశోక్, అరూరి స్వామి, బషీర్ పాల్గొన్నారు.

## విద్యతో ఉన్నత స్థానాలకు చేరుకోవాలి

- హాస్టల్స్‌ను సద్వినియోగం చేసుకొని చదువుకోవాలి
- కలెక్టర్ నారాయణ రెడ్డి



నల్లగొండ ఆర్పీ రోడ్డులోని సాంఘిక సంక్షేమ బాలికల హాస్టల్‌లో విద్యార్థినులతో మాట్లాడుతున్న కలెక్టర్ నారాయణరెడ్డి

నల్లగొండ, జూలై 4 : ప్రభుత్వ హాస్టళ్లలో ఉంటూ విద్యనభ్యసించే విద్యార్థులు బాగా చదువుకొని సమాజంలో ఉన్నత స్థానాల్లో స్థిరపడ్డప్పుడే మంచి గుర్తింపు ఉంటుందని కలెక్టర్ సి.నారాయణరెడ్డి అన్నారు. నల్లగొండ జిల్లా కేంద్రంలోని ఆర్పీ రోడ్‌లో, జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి కార్యాలయానికి ఎదురుగా ఉన్న సాంఘిక సంక్షేమ బాలికల కళాశాల హాస్టల్‌ను గురువారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా హాస్టల్ వంటగదిని, భోజనాన్ని, టాయిలెట్లు, డైనింగ్ హాల్, విద్యార్థినుల బ్యారక్‌లు పరిశీలించారు. అనంతరం ఆయన విద్యార్థినిలతో కింద కూర్చొని ముఖాముఖి మాట్లాడారు. ఎక్కడి నుంచి వచ్చారు.. ఏం చదువుతున్నారు.. ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో ఎన్ని మార్కులు వచ్చాయి.. పీజీ చదివే విద్యార్థులు అయితే డిగ్రీలో ఏం చదివారు? వంటి వివరాలను అడిగి తెలుసుకున్నారు. హాస్టళ్లలో గ్రామీణ ప్రాంతం, పేదరికం నుంచి వచ్చిన వారే ఎక్కువ ఉంటారని, విద్యార్థులు సైతం అదే రీతిన కష్ట కష్టపడి చదివి గుర్తింపు తెచ్చుకోవాలని సూచించారు. విద్యార్థులు సమయాన్ని వృథా చేయొద్దని, సెల్ ఫోన్ వినియోగం తగ్గించాలని తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ తాను కూడా ప్రభుత్వ పాఠశాల, కళాశాలలో చదివానని, ఎన్నో కష్టాలను అధిగమించి టీచర్‌గా పని చేస్తూ, జిల్లా కలెక్టర్ స్థాయికి ఎదిగానని విద్యార్థులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిశ్రమల శాఖ జీఎం, సాంఘిక సంక్షేమ శాఖ ఇన్‌చార్జి డీడీ కోటేశ్వర్‌రావు, హాస్టల్ వార్డెన్లు రమ్య సుధా, సోమేశ్వరి తదితరులు ఉన్నారు.

## కరెంటు రాక రైతు పాట్లు



బావిలోకి దిగి బకెట్లలో నీటిని పైకి తెచ్చుకుంటున్న రైతులు

కోదాడ రూరల్, జూలై 4 : వ్యవసాయ కరెంటు సమస్యలతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. కొమరబండ రెవెన్యూ పరిధిలో ఆయిల్‌పామ్ తోట సాగు చేసిన రైతు కొల్లు వెంకటేశ్వరావుకు గురువారం ఉదయం తోటకు మందు కొట్టేందుకు వచ్చాడు. ఉదయం నుంచి కరెంటు లేక పోవడంతో ట్రాన్స్‌కో అధికారులకు ఫోన్ చేశాడు. తమ వద్ద లోపం లేదని, మీవద్దే ఉందని అధికారులు సమాధానం ఇచ్చారు. ప్రైవేటు ఎలక్ట్రీషియన్‌ను తీసుకొచ్చి చూపించగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ నుంచి సప్లయ్ లేదని తెలిపాడు. ఇదే విషయాన్ని అధికారులకు తెలిపినా వారు పట్టించుకోలేదు. దాంతో చేసేది లేక బావిలోకి దిగి బిందెలతో నీటిని తోడుకొని వచ్చి మొక్కలకు పోశాడు. కరెంటుకు ఇబ్బంది రానివ్వం అంటూ హామీ ఇచ్చిన ప్రభుత్వం తమ ఇబ్బందులను పట్టించుకోవడం లేదని రైతు ఆవేదన వ్యక్తం చేశాడు.



జడ్పీ భవనం మరమ్మతు పనులకు శంకుస్థాపన చేస్తున్న జడ్పీ చైర్మన్ ఎలిమినేటి సందీప్‌రెడ్డి

## అభివృద్ధిలో ఆదర్శంగా నిలిపాం

- జిల్లా పరిషత్ చైర్మన్ ఎలిమినేటి సందీప్‌రెడ్డి

భువనగిరి కలెక్టరేట్, జులై 4 : జిల్లాను అభివృద్ధిలో ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు శక్తివంచన లేకుండా సమగ్ర చర్యలు చేపట్టానని జడ్పీ చైర్మన్ ఎలిమినేటి సందీప్‌రెడ్డి అన్నారు. జిల్లా పరిషత్ కార్యాలయ మరమ్మతు పనులకు గురువారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాను అన్నిరంగాల్లో అభివృద్ధి చేసేందుకు అకుంటిత దీక్షతో ముందుకు సాగామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ ధనావత్ బీకునాయక్, భువనగిరి జడ్పీటీసీ సుబ్బూరు బీరుమల్లయ్య, జడ్పీ సీఈఓ ఎన్.శోభారాణి, డిప్యూటీ సీఈఓ విష్ణువర్ధన్‌రెడ్డి, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.



దొడ్డి కొమురయ్య చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న అదనపు కలెక్టర్ పి. బెన్‌షాలోమ్, అధికారులు

## దొడ్డి కొమురయ్య త్యాగం మరువలేనిది

- అదనపు కలెక్టర్ బెన్‌షాలోమ్

భువనగిరి కలెక్టరేట్, జూలై 4 : తెలంగాణ రైతాంగ సాయిధ పోరాట వీరుడు దొడ్డి కొమురయ్య త్యాగం మరువలేనిదని రెవెన్యూ అదనపు కలెక్టరు పి. బెన్‌షాలోమ్ అన్నారు. కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో గురువారం దొడ్డి కొమురయ్య 78వ వర్ధంతిని పురస్కరించుకొని ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా దొడ్డి కొమురయ్య పోరాటస్ఫూర్తిని కొనియాడారు. ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ పరిపాలన అధికారి జగన్మోహన ప్రసాద్, జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ అధికారి యాదయ్య, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ శ్యాంసుందర్, కలెక్టరేట్ సూపరింటెండెంట్ రామారావు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ఇన్‌స్పైర్ అవార్డుల దరఖాస్తులకు సూచనలు

భువనగిరి అర్బన్, జూలై 4 : ఇన్‌స్పైర్ అవార్డుల కోసం దరఖాస్తు చేసుకునే పలు అంశాలపై ఆన్‌లైన్‌లో పలు సూచనలు, సలహాలను ఇవ్వనున్నట్లు డీఈఓ కె.నారాయణరెడ్డి గురువారం ప్రకటనలో తెలిపారు. ఇన్‌స్పైర్ అవార్డుల కోసం సెకండరీ, ప్రాథమికోన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ప్రిన్సిపాళ్లు, సంబంధిత ఉపాధ్యాయులు, 6 నుంచి 10 తరగతులు చదువుతున్న విద్యార్థులు ఈ నెల 6న ఉదయం 11 నుంచి 12 గంటల వరకు టీ–శాట్ నెట్‌వర్క్ ద్వారా టెలీకాన్ఫరెన్స్‌ను వీక్షించాలని పేర్కొన్నారు. టీ–శాట్ నెట్‌వర్క్ ద్వారా వీక్షించేలా (యూ–ట్యూబ్) అన్ని యాజమాన్యాల ప్రాథమికోన్నత, సెకండరీ పాఠశాలలో గల ప్రధానోపాధ్యాయులు తగు ఏర్పాట్లు చేయాలని తెలిపారు. మరింత సమాచారం కోసం జిల్లా సైన్స్ అధికారి భరణి కుమార్‌ను 9000989726 సెల్ నంబర్‌లో సంప్రదించాలని పేర్కొన్నారు.

## ప్రత్యేకాధికారుల నియామకం

భువనగిరి కలెక్టరేట్, జూలై 4 : స్థానిక సంస్థల పాలక వర్గాల పదవీకాలం ముగియడంతో మండలాలకు జిల్లా స్థాయి అధికారులను ప్రత్యేకాధికారులుగా నియమిస్తూ కలెక్టర్ హనుమంతు కె.జెండగే గురువారం ఉత్తర్వులు జారీచేశారు. మండలాల వారీగా నియమితులైన ప్రత్యేక అధికారులు వీరే.

| మండలం | అధికారి పేరు | హోదా |
|---|---|---|
| అడ్డగూడూరు | అయిలయ్య | జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి |
| ఆలేరు | కె.అనురాధ | వ్యవసాయశాఖ అధికారి |
| ఆత్మకూరు(ఎం) | ఎం.రాజారాం | మత్స్యశాఖ అధికారి |
| భువనగిరి | డి. విష్ణువర్ధన్‌రెడ్డి | జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈఓ |
| బీబీనగర్ | జి.అన్నపూర్ణ | జిల్లా ఉద్యానవనశాఖ అధికారి |
| బొమ్మలరామారం | పి.జ్యోతికుమార్ | భూగర్భజలశాఖ అధికారి |
| చౌటుప్పల్ | రాజేశ్వర్‌రెడ్డి | పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ |
| గుండాల | వెంకటేశ్వర్లు | ముఖ్య ప్రణాళికా అధికారి |
| మోటకొండూరు | పి. నాగమణి | జిల్లా సహకార శాఖ అధికారి |
| మోత్కూరు | బి.యాదయ్య | జిల్లా వెనుకబడిన తరగతుల శాఖ అధికారి |
| సంస్థాన్‌నారాయణపురం | ఎం. జైపాల్‌రెడ్డి | ఎస్సీ అభివృద్ధి అధికారి |
| భూదాన్‌పోచంపల్లి | కె.విద్యాసాగర్ | చేనేత సహకార అధికారి |
| రాజాపేట | ఆర్. సునంద | జిల్లా పంచాయతీ అధికారి |
| రామన్నపేట | రాఘవరెడ్డి | ఏడీ, మైన్స్ |
| తుర్కపల్లి | సురేశ్ | అడిషనల్ డీఆర్‌డీఓ |
| వలిగొండ | కేఎంవీ జగన్నాథరావు | స్పెషల్ డిప్యూటీ కలెక్టర్, భూసేకరణ |
| యాదగిరిగుట్ట | ఎ.సబిత | జిల్లా మార్కెటింగ్ అధికారి |